క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, ఏఎస్.రెడ్డి నగర్, పుప్పాలగుట్ట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు, రామా టాకీస్, రామన్నపేట, బొందివాగు, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు స్వాగతం

కాజీపేట రూరల్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో కాజీపేట బాపూజీనగర్ చౌరస్తాలో గురువారం స్వాగతం పలికారు. వరంగల్ పర్యటనలో భాగంగా బాపూజీనగర్‌కు చేరుకున్న కవితను బీఆర్ఎస్ నాయకులు ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సోదా కిరణ్, బీఆర్ఎస్ నాయకులు దువ్వ కనకరాజ్, దువ్వ నరేష్, మైలారం శంకర్, వినయ్, విజయ్‌కుమార్, కోండ్ర శంకర్ పాల్గొన్నారు.

కేతిరి నివాసానికి ఎమ్మెల్సీ కవిత

వరంగల్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్సార్‌నగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి తేనేటి విందు స్వీకరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ సమీపంలో గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న యువకుడిని ఎస్సై లవన్ కుమార్ గురువారం అరెస్ట్ చేసి అతడి నుంచి 300గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ట్యాంక్ బండ్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న హనుమకొండ ప్రాంతానికి చెందిన పల్లపు రఘును తనిఖీ చేయగా అతని వద్ద శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించింది. ఈమేరకు రఘును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

పశువులను దొంగిలిస్తున్న ఇద్దరి అరెస్ట్

రామన్నపేట: వరంగల్ నగరంలోని ఎల్బీనగర్, ఆటోనగర్‌లో పశువులను దొంగిలిస్తున్న ఎల్బీనగర్‌కు చెందిన జావెద్, మహ్మద్ బిలాల్‌ను అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. వారి నుంచి రూ.70 వేలను స్వాధీనం చేసుకుని కోర్టుకు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు

ఖిలా వరంగల్: టిప్పర్‌తో ఓ వ్యక్తిని ఢీకొట్టి తీవ్ర గాయాలకు కారకుడైన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఖిలా వరంగల్ ప్రాంతానికి చెందిన మాడిశెట్టి రాజు.. ఈనెల 22న మధ్యాహ్నం ఓసిటీలో ఎండి వేడిని తట్టుకోలేక వరంగల్ – నర్సంపేట రోడ్డులో వేపచెట్టు కింద నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో టిప్పర్ డ్రైవర్ వేగంగా వెళ్తూ రాజును ఢీకొట్టాడు. దీంతో అతడి తొంటి విరగగా, స్థానికులు అతన్ని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. రాజు కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై..



మడికొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేర్సన్ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజేష్ నాయక్‌పై మడికొండ పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అమీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్కూరి రేవంత్, బస్కే ప్రణయ్, కాజీపేట మండల ఉపాధ్యక్షుడు బోగి కృష్ణ పాల్గొన్నారు.

వాహనదారులకు రెండు రోజుల జైలు

మామునూరు: ద్విచక్ర వాహనానికి ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తున్న ఐనవోలు మండలం నర్సింహుల గూడెంకు చెందిన నమిండ్ల భరత్, పడమర కోటకు చెందిన ఇనుముల హరిబాబుకు వరంగల్ జిల్లా కోర్టు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

రూ.15 లక్షల నగదు, 5తులాల బంగారం అపహరణ

మామునూరు: తాళం వేసి కుటుంబ సమేతంగా ఊరెళ్లిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం ఉదయం చోరీకి పాల్పడ్డారు. రూ.15 లక్షల నగదు, 5 తులాల బంగారం అపహరించుకు పోయినట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు. ఆమె కథనం ప్రకారం మామునూరు శివారులోని సింగారం రోడ్డుకు చెందిన ఆవునూరి యాదగిరి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హనుమకొండలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. అది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని నగదు, బంగారం చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కంపుకొడుతున్న బీట్ బజార్

- అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు





బీట్ బజార్‌లోని నవీన్ థియేటర్ ఎదుట మురుగుతో నిండిన డ్రెయినేజీలు

రామన్నపేట: వరంగల్‌లో వ్యాపార కేంద్రం అంటే ప్రతీ ఒక్కరికి గుర్తుకు వచ్చేది బట్టల బజార్, బీట్ బజార్. ఈ ప్రాంతాల్లో నిత్యం వందలాది మంది వ్యాపారం చేస్తుండగా, వేలాది మంది రాకపోకలు సాగిస్తూ తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. కిరాణ హోల్‌సెల్‌తో పాటు స్టీల్, బిల్డింగ్ మెటీరియల్స్ సైతం లభ్యమవుతాయి. నగరానికి తలమానికంగా ఉన్న వ్యాపార కేంద్రమైన బీట్‌బజార్‌లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఓ పక్క చెత్తాచెదారం.. మరో పక్క మురుగునీటి కాలువలతో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపైకి వస్తుండడంతో ఆ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. వ్యాపారస్తులు సైతం దుర్గంధాన్ని భరించలేక అనారోగ్యం బారినపడడంతో పాటు వ్యాపారాలు సైతం మూసుకునే పరిస్థితి నెలకొంటుంది. అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

విన్నవించినా ఫలితం లేదు



బీట్ బజార్‌లో లోపిస్తున్న పారిశుద్ధ్యం, అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా వారు పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో పరిసరాలు ఇంకా అధ్వానంగా తయారవుతాయి. మురుగునీరంతా రోడ్లపైకి చేరడంతో వ్యాపారస్తులు, వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలి.

– అమీన్, వ్యాపారస్తుడు

శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజుల పాటు జరగనున్న నాయిని విశాల్‌రెడ్డి స్మారక 7వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్ –15 బాలబాలికల హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ పోటీలను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఉద్దేశించి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలను వారికి ఇష్టమైన క్రీడల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని గుర్తుచేశారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 300ల మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, ఒలింపిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి బైరబోయిన కై లాస్ యాదవ్, అధ్యక్షుడు అజీజ్ ఖాన్, స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, డీఎస్ఏ కోచ్‌లు బొడ్డు విష్ణువర్ధన్, శ్రీమన్నారాయణ, క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం



విద్యారణ్యపురి: సివిల్స్‌లో 255 ర్యాంకు సాధించిన పూర్వ విద్యార్థి పోతరాజు హరిప్రసాద్‌ను హనుమకొండలోని ఆర్యభట్ట హైస్కూల్ యాజమాన్యం గురువారం సన్మానించింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ నరేశ్ చంద్రభరత్, వీణభరత్, విక్రాంత్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సాయి శివానికి అభినందనలు

వరంగల్: సివిల్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 11వ ర్యాంకు సాధించిన శివనగర్‌కు చెందిన సాయి శివానికి పలువురు అభినందనలు తెలిపారు. నగరంలోని దత్తాత్రేయ టెంపుల్, వేంకటేశ్వరస్వామి దేవాలయాలను ఆమె గురువారం సందర్శించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలో శివానిని 28 డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన – నవీన్ సన్మానించి వేంకటేశ్వర స్వామి సిల్వర్ ప్రతిమను అందించారు. శివానిని వరంగల్ రూరల్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు మేకల చక్రి, శివ, అరవింద్ తదితరులు అభినందించారు.

ఖిలా వరంగల్: శివనగర్‌కు చెందిన ఇట్టబోయిన సాయి శివానిని గురువారం పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అభినందించిన వారిలో సామాజిక వేత్త మేరుగు అశోక్, 35వ డివిజన్ పద్మశాలి అధ్యక్షుడు గడ్డం రవి, అంకతి అఖిల్, తొటం శివ, లింగం తదితరులు ఉన్నారు.

వారికి యువ వికాసం పథకం వర్తించదు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: దళిత బంధుతో పాటు ఐదేళ్ల కాలంలో సర్కార్ నుంచి లబ్ధిపొందిన వారికి రాజీవ్ యువ వికాసం వర్తించదని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంపై వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. హనుమకొండలోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ఆయన అడిగి తెలుసుకున్నారు. అధికారులు సిఫార్సు చేసిన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, అదనపు కమిషనర్ జోనా, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సురేష్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాంరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్నరాణి, రాజేశ్వర్, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ సుధీర్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు ఈదురు అరుణ, జలగం అనితతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ప్రకాశ్, ప్రకాశ్, శివరామకృష్ణ, జాఫర్ బాబా, కొమురెల్లి, జోగిరెడ్డి, గోపాల్‌రావు, మధుకర్‌రావు, ప్రసాద్, చెన్నారెడ్డి, దశరథం, చంద్రమౌళి, రవీందర్ పాల్గొన్నారు.

పరిశోధనలు.. పరిష్కార మార్గాలు

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శోభ



మాట్లాడుతున్న శోభ

కేయూ క్యాంపస్: సామాజిక రుగ్మతలు, సామాజిక సమస్యలపై పరిశోధనలు చేసి పరిష్కార మార్గాలను చూపాలని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మానవ వనుల విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వి.శోభ సూచించారు. కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ మానవ వనరుల విభాగం పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీ తరగతుల్లో ఆమె గురువారం పాల్గొని మాట్లాడారు. దేశంలో సామాజిక సమస్యలు – సవాళ్లు అనే అంశంపై మాట్లాడుతూ ప్రాచీన కాలంనుంచే దేశంలో నలంద, తక్షశిల వంటి విశ్వ విద్యాలయంలో నాటి సామాజిక అంశాలపై పరిశోధనలు జరిపాయని గుర్తుచేశారు. ప్రభుత్వాలు పరిశోధకులకు ఆర్థిక చేయూత నివ్వాలని కోరారు. సామాజిక శాస్త్ర పరిశోధనలకు వెనుకబాటుకు గల కారణాలు – సమకాలిన అధ్యయనం అనే అంశంపై ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పింగిళి నర్సింహారావు మాట్లాడుతూ పరిశోధకులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్‌రావు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి



సదస్సులో మాట్లాడుతున్న అరూరి రమేష్

హన్మకొండ: అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాణ జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆలోచనల మేరకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ నడుచుకుంటున్నారని గుర్తుచేశారు. తొలుత జమ్మూకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, నాయకులు గజ్జెల్లి శ్రీరాములు, నర్మెట్ట శ్రీనివాస్, డివిజన్, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులివ్వాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

హన్మకొండ: అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలకు ఇచ్చినట్లుగానే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సెలవులు ఇవ్వాలని కోరారు. అలాగే, టీచర్లకు రూ.32 వేలు, ఆయాలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ధర్నా కార్యక్రమంలో నాంపల్లి శోభారాణి కర్పూజా, జమున, ఎం.అరుణ, ఆర్.సత్తెమ్మ, బానోతు తిరుమల, మమత, ప్రమీల, లక్ష్మి, సునీత, స్వరూప పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు జయశంకర్ పేరు పెట్టాలి



వేదికపై నుంచి అభివాదం చేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: మామునూరు విమానాశ్రయానికి తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం బాధ్యులు డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్ గురువారం జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్ మాట్లాడారు. తెలంగాణ ప్రజల మనోభావాలు, ఆకాంక్షలే తన జీవిత లక్ష్యంగా జయశంకర్ ముందుకు సాగారని గుర్తుచేశారు. ఎయిర్‌పోర్ట్‌కు జయశంకర్ పేరు పెట్టాలని రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, రాగిఫణి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కాజీపేట: కాజీపేట గ్రంథాలయానికి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత పలు పుస్తకాలను గురువారం అందజేశారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిరుద్యోగులతో పాటు పాఠకులకు ఉపయోగపడే పుస్తకాలను లైబ్రేరియన్ కొండయ్యకు అందించారు. వాటిలో మహానుభావుల విజయ గాథలు, ఆత్మకథలు, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే పుస్తకాలు ఉన్నాయి. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణుతో పాటు పాఠకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా పరిశీలకుడిగా నమిండ్ల శ్రీనివాస్



హసన్‌పర్తి: కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా పరిశీలకుడిగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం కోమటిపల్లికి చెందిన నమిండ్ల శ్రీనివాస్‌ను నియమించారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేస్తారని ఆయన అన్నారు.

మహంకాళి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జీర్ణోద్ధారణ, ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జన్ను కిషన్ మాట్లాడుతూ నవంబర్ 24, 25, 26వ తేదీల్లో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పురోహితులు రమేశ్‌శర్మ మాట్లాడుతూ వాస్తుకు విరుద్ధంగా ఆలయం ఉండడంతో నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, యాదవ సంఘం అధ్యక్షుడు సుధాకర్, రజక సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, చేనేత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు భాస్కర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, గాంధీనగర్ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ కోచింగ్ పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట / కాజీపేట రూరల్: కాజీపేట పట్టణంలో బాక్సింగ్ ట్రైనింగ్ సెంటర్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ముప్పిడి వెంకటేష్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేసి క్రీడాకారులకు అందజేశారు. ఏప్రిల్ 25 నుంచి మే 15 వరకు విద్యార్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, మండలోజు కృష్ణమూర్తి, ముప్పిడి మనోజు, కోండ్ర నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌కు యూజీసీతో సంప్రదిస్తాం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల రెగ్యులరైజేషన్‌కు యూజీసీతో సంప్రదింపులు చేస్తామని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. తమను క్రమబద్ధీకరించాలని ఆరు రోజులుగా చేస్తున్న సమ్మెకు ధర్మారావుతో పాటు ఎమ్మార్పీఎస్ నేత మంద కుమార్‌మాదిగ, సీపీఎం జిల్లా కార్యదర్శి సూరం ప్రభాకర్‌రెడ్డి గురువారం సంఘీభావం తెలిపారు. రెండోగేట్ ఎదురుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మానవహారం నిర్వహించారు. అక్కడి నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ కొనసాగింది. ఎమ్మార్పీఎస్ నాయకుడు కందికంట్ల విజయ్, డీవైఎఫ్ఐ తిరుపతి, రీసెర్చ్ స్కాలర్స్, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. అనంతరం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు వంటవార్పు చేసి నిరసన తెలిపారు.

పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైంస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం అధ్యాపకులు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. నూతన నియామకాల్లో పార్ట్‌టైం అధ్యాపకులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేందర్‌నాయక్ బాధ్యులు సంజీవ్, ఫణీంద్రకుమార్, నరేష్, మాధవి, సరిత, మయూరి, రమేష్, రాజేందర్, శ్రీధర్, సద్గుణ, కవిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరుల దాడిలో మరణించిన పర్యాటకులకు నగర వ్యాప్తంగా ప్రజలు గురువారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీలు తీశారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ర్యాలీలో పాల్గొన్న ఐఎంఏ వరంగల్ శాఖ బాధ్యులు



జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



హసన్‌పర్తి: ముచ్చర్లలో కొవ్వొత్తుల ర్యాలీ



కాజీపేట చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న తేజోమాయి మాల కుల సంఘం సభ్యులు

ఎల్కతుర్తి జంక్షన్‌ను సిద్ధం చేయండి

- కుడా వైస్ చైర్‌పర్సన్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఎల్కతుర్తి జంక్షన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్/నయీంనగర్ : మూడు జిల్లాలకు తలమానికంగా నిలవనున్న ఎల్కతుర్తి జంక్షన్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కుడా వైస్ చైర్‌పర్సన్, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే కుడా అధికారులను ఆదేశించారు. ఎల్కతుర్తి బస్టాండ్ సమీపంలోని ప్రధాన కూడలిని ఆమె గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. జంక్షన్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని వేగవంతంగా పూర్తి చేయడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషన్ మాట్లాడుతూ వరంగల్, సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు ఈ కూడలి తలమానికంగా నిలిచేలా పెద్ద విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 80శాతం సివిల్ పనులయ్యాయని, మిగిలిన ఫర్నిషింగ్, గ్రీనరీ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ అమరవేణి

హన్మకొండ: ఎంబీఏ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ప్రొఫెసర్ పి.అమరవేణి అన్నారు. గురువారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో మంత్ర 2కే25 జాతీయ స్థాయి సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ కె.రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదగాలన్నారు. విశిష్ట అతిథిగా జెన్‌ఫాక్ట్ వైస్ ప్రెసిడెంట్ విద్య పాల్గొని మాట్లాడుతూ ఏఐ రంగంలో నైపుణ్యతను సాధించాలని సూచించారు. మంత్ర 2కే25 కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 300కు పైగా ఎంబీఏ విద్యార్థులు పాల్గొని వివిధ మేనేజ్‌మెంట్ రంగాలైన యంగ్ మేనేజర్ అవార్డు, ఫైనాన్స్ హెచ్ఆర్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ క్విజ్, ట్రెజర్ హంట్, మంత్రామస్తి వంటి వాటిల్లో పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వాగ్దేవి ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ హరీందర్ రెడ్డి, కళాశాల ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ మహేందర్ కుమార్, సీనియర్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, మంత్ర 2కే25 కన్వీనర్ ఎ.రజిని కుమార్, డాక్టర్ పి.సుగుణాకర్ రెడ్డి, బి.కిషోర్ కుమార్, టి.అనూష, డాక్టర్ డి.ప్రేమ్ కుమార్, కరుణ, డాక్టర్ బి.చంద్రకళనాయక్, శాంభవి, డాక్టర్ అరవింద, డాక్టర్ స్వాతి, డాక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ సురేష్

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి వారితో శాంతిచర్చలు జరపాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో గత కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకపు గిరిజనులు, మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. చర్చలకు మావోయిస్టులు సిద్ధమని ప్రకటించినప్పటికీ వారితో చర్చలు జరపకుండా కర్రి గుట్టల ప్రాంతాల్లో కేంద్ర బలగాలు మోహరించడం వలన ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆదివాసీలు భయాందోళనలతో గడుపుతున్నారన్నారు. సహజ వనరులను కార్పొరేటర్ శక్తులకు ధారాదత్తం చేయడం కోసమే ఆపరేషన్ కగార్‌ను కేంద్రం చేపట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో న్యాయవాది కలకోటి మహేందర్, ప్రజా సంఘాల నాయకులు మిరియాల కుమార్, మంద రవి, వట్టం సాయికుమార్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు